# కృపచేతనే రక్షింపబడియున్నారు

# (2:8-10)

బహు తక్కువ యిష్టంగా ఉండే కార్యకలాపాలలో లెక్కల చీట్లు (బిల్స్) చెల్లించడానికి కూర్చుండి చెక్కులు వ్రాసే పని ఒకటి. ఒక అంగుళం ఎత్తుకు చేరేవరకు ఆ పనిని ప్రక్కన పెడతాను. అప్పుడు ఆ పనిని ఆరంభించే సమయం వచ్చిందనుకుంటాను.

ఇన్సూరెన్స్ కంపెనీకి నేను కట్టవలసినది ప్రతి నెల పదిహేనవ తేదీకి వస్తుంది. కొన్ని సార్లు ఖచ్చితంగా పదిహేనుకే చెక్కు పంపడంలో నేను తప్పిపోతాను. ఎప్పుడైనా ఒకసారి వారు నాకు నోటీసు పంపేవరకు చెల్లించడం మరచిపోతాను. అయినా, కంపెనీ ఆ డబ్బు చెల్లించే అవకాశాన్ని నాకు యిస్తుంది. ముప్పై దినాల "గ్రేస్ పిరియడ్" అనేదాన్ని వారు యిస్తారు. కట్టవలసిన నియామక కాలం గడిచిన ముప్పై దినాలవరకు నేను కట్టకపోయినా, వారు నాకు యింకను అవకాశమిస్తారు.

ఆ "గ్రేస్ పిరియడ్" (కృపా కాలానికి) నేను పాత్రుడనా? లేదు, నేను వారికి కట్టవలసిన డబ్బు కట్టలేదు. వారు కేవలం నా కొరకు దాన్ని పొడిగించారు. నేను దేనికి అపాత్రుడనో దానిని వారు నాకు నిజంగా యిస్తున్నారు.

బైబిల్లో "కృప" అనేది ఒక కీలక పదమైయుంది. ఆదిమ హెబ్రీ భాషలో వంగుట లేక ముందుకు, క్రిందికి వంగుట అనే భావాన్ని యిస్తుంది. కాల క్రమాలలో – "తక్కువవారికి ఉపకారము చేయుటకు తాను అంతస్తునుండి దిగు," లేక ఒకనికి ఎదురు చూడని ఉపకారము చేయు అనే తలంపు అందులో చేర్చబడింది. కేవలం తన హృదయపు ఔదార్యాన్ని బట్టి, ఒక సేవకునికి ఏదో దయ చూపడానికి ఒక రాజు తన మార్గం దాటి వెళ్లిన సంగతిని గూర్చి ఆలోచించు.

నరుని పట్ల దేవుని కృపను బైబిలు ప్రస్తావించిన ప్రతిసారి లేక ఎప్పుడు ప్రస్తావించినా, ఆ కార్యం చేయతగింది కాదన్న స్వభావాన్నే నొక్కి పలుకుతుంది. మన యెడల దేవుడు దయ చూపడం కేవలం ఆయన ప్రేమను బట్టియేగాని, ఆయన మనకు ప్రసాదించే దానిలో మనకు ఏదైనా యోగ్యత ఉన్నదాన్ని బట్టి కాదు. కృప అనేది దేవుడు తాను యిష్టపూర్వకంగా కోరి యిచ్చేదేగాని, మనకు యివ్వవలసినట్టు పూటపడి యిచ్చేది కాదు.

"కృప" అనే పదాన్ని ప్రత్యేకించి ప్రభువైన యేసు ఉపయోగించిన రికార్డు లేదని నీకు తెలుసా? అయినా, కృప అనేదానికి పరిపూర్ణమైన అర్థం ఆయన ఎరుగునని ఆయన కార్యాలే సూచిస్తున్నాయి. కృప క్రీస్తునుండి ధారాళంగా ప్రవహించింది. కానా వివాహమందును, సమరయ బావి వద్దను, ఇంటి కప్పు విప్పి క్రిందికి దించిన రోగిని బాగు చేయడంలోను అది ప్రవహించింది. సుంకరియైన జక్కయ్యకును, తన వస్త్రపు

చెంగును ముట్టిన స్త్రీకిని, వ్యభిచారమందు పట్టబడిన స్త్రీకిని ప్రభువైన యేసు కృప ప్రదర్శింపబడింది.

ప్రత్యేకించి, సిలువయందు కృప విస్తరించింది. మనం లేఖనాలు చదువుతుండగా, "యేసూ, నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుము" అని వేడుకొనిన మృతినొందే నేరస్థుని మనం గొల్గొతాలో కలుసుకుంటాం (లూకా 23:42). ఏది అవసరమయ్యిందో అది తప్ప, అతనికి యేసుని గూర్చి ఎక్కువగా తెలియదు. తన నిస్సహాయ స్థితిని మాత్రం అతడు గ్రహించాడు. అతడు ఏదో అయ్యున్నట్టు యితరులు చెప్పినట్టు ఆయన అయ్యుంటే, ఆయన తప్పక వ్యత్యాసం చేయగలడన్న సంగతిని అతడు గ్రహించాడు. దొంగ కనికరం కొరకు ఎందుకు విన్నవించుకున్నాడో అది వివరిస్తుంది. యేసు మాత్రమే ప్రసాదించగల కృపను అతడు వెదకాడు.

ప్రభువైన యేసు మరియు దొంగ మధ్య ఆ క్షణంలో జరిగిన దానిని గ్రహించడానికి ఒక రచయిత యిలా ప్రయత్నించాడు:

> ఆ మనుష్యుడు సహాయం పొందగలుగునట్లు చేసినదేమి? నాతో చెప్పు. అతడు తన జీవితాన్ని వ్యర్థపరచాడు. క్షమాపణ కోరడానికి అతడు ఏపాటివాడు? బహిరంగంగా అతడు యేసును హేళన చేశాడు. ఈ ప్రార్థనను ప్రార్థించడానికి అతనికి ఏ హక్కు ఉంది?
>
> నీవు నిజంగా తెలుసుకోగోరుతున్నావా? నీ ప్రార్థన ప్రార్థించడానికి అదే హక్కు నీకును ఉంది.
>
> నీవు నేను సిలువలో అలాటివారమే. వస్త్రహీనులం, ఒంటరివారం, నిరీక్షణ లేనివారం, దూరస్థులం. అది మనం. నేను చేసినది ఏమైనప్పటికిని, నీవు ఏమై యున్నప్పటికిని, మన మందరం ఒక చోటుకి వెళ్లినప్పుడు నీవు నన్ను జ్ఞాపకం చేసుకొనగలవా?
>
> మనం అతిశయపడం ...
>
> అది మనం పాత్రమైన దానికంటె అధికం. అయితే మనం నిరాశపడినవారము. గనుక మనం విన్నవించుకొంటున్నాం.[1]

పౌలు 2:8-10లో వ్రాసిన దాని కేంద్ర స్థానంలో కృపచేతనే రక్షణ అనేది ఉంది:

> మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు; ఇది మీవలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియలవలన కలిగినది కాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు. మరియు వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్ క్రియలు చేయుటకై, మనము క్రీస్తు యేసునందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియై యున్నాము.

కృపచేతనే రక్షణ అనే విషయాన్ని ఈ లేఖన భాగం స్థిరపరచుతుంది. అది మనకు ఈ సంగతి చెప్పుతుంది: మన రక్షణను సాధ్యం చేసే కృప నిమిత్తం దేవుడు మాత్రమే మహిమకు అర్హుడైయుంటాడు. 2:8-10లోని ప్రాథమిక సత్యమది.

## మన రక్షణ దేవుని కృపామహదైశ్వర్యానికి కీర్తి కలుగజేస్తుంది

8వ వచనం తిరిగి చదువు: "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారు ..." ఇందులో మూడు కీలక పదాలను గమనించు: మొదటిది, నామవాచకం "కృప" (గ్రీకు.: *charis*). కృప అనేది దేవుడు అనర్హునికి చేసే ఉపకారమైయుంది. రక్షింపబడడానికి మనయందు ఏ యోగ్యతాలేదు. మనమేమైయున్నామో మనం ఏమి చేస్తామో అనేవి – తనతో మనకు నిత్య జీవమిచ్చేలా దేవుని రుణస్థునిగా చేయలేవు. మంచి కార్యమేదియు, మత సంబంధమైన ఏ కర్మయూ, ఏ త్యాగమును, ద్రవ్య సంబంధమైన ఏ కానుకయు, ప్రభువు నామమున జరిగించు ఏ పరిచర్యయు మనలను రక్షించేలా దేవుని ఉత్తరవాదిగా చేయనేరవు.

మనం యోచించగల మహా నమ్మశక్యం కాని ఆలోచన యిది: ఆయనకు విరోధంగా మనం పాపం చేసినప్పటికిని దేవుడు మనలను ప్రేమిస్తున్నాడు, కృపచేత రక్షింప వెదకుతున్నాడు, పరలోకంలో తనతో కూడ నిత్య జీవం ప్రసాదించడానికి ఆయన వాంఛిస్తున్నాడు. ఆయనకు విరోధంగా మనం పాపం చేసినప్పటికిని ఆశ్చర్యాన్ని కలిగించే ఈ కృపకు మించినదేదీలేదు!

8వ వచనంలో రెండవ కీలక పదం "రక్షింపబడియున్నాము" (గ్రీకు.: *sozo*). క్రియా వాచకం అణగియుండెడిదై ఉంది. మనకు చేయబడవలసిన దానిని నొక్కి పలుకుతుంది. మనలను మనం రక్షించుకోలేం. దేవుడు మనలను రక్షిస్తాడు. దేవుడు మన పక్షంగా కార్యాన్ని జరిగిస్తాడు. మన రక్షణ మనయందలి దేవుని పనిని రూఢి పరుస్తుంది. లేక మన జీవితములయందలి దేవుని కార్యాన్ని నిరూపిస్తుంది.

"రక్షింపబడియున్నాము" అనేదానికి అసలు పదం – "తప్పింపబడుట, విడిపించ బడుట" అనే భావాన్ని తెలియజేస్తుంది. దేవుని కృప ఆపదనుండి మనలను తప్పిస్తుంది. అధ్యాయం 2 యొక్క సందర్భంలో, యిందులో ఏమి యిమిడియుందో మనం చూడగలం. దేవుని కృప మన హృదయములలోనికి ప్రవహింపకముందు, మనము చచ్చినవారమై – సంపూర్ణంగా దేవునినుండి వేరుచేయబడినవారమై ఉంటిమి (2:1), అపవాది ఆధీనంలో (2:2), దేవుని ఉగ్రతకు పాత్రమైన పాపులమై ఉంటిమి (2:3).

ఇట్టి పరిస్థితినుండి దేవుని కృప మనలను విడిపించింది. ఆయన కృప మనలను మరణంలోనుండి జీవములోనికి తెచ్చింది. అపవాది యొక్క స్వాధీనంలోనుండి ఆయన కృప మనలను విడుదల చేసింది. శిక్షావిధికి లోనైన పాపులుగా దేవుని ఉగ్రతను ఎదుర్కోకుండ ఆయన కృప మనలను తప్పించింది. కృపచేతనే మనం రక్షింపబడియున్నాం.

8వ వచనంలో మూడవ కీలక పదం "విశ్వాసం" (గ్రీకు.: *pistis*). కృపవలన మనకు లభించే రక్షణ విశ్వాసపు మార్గంలో వస్తుంది. రక్షణ అనే దేవుని కృపా ప్రసాదము అందుకోవాలంటే మనకు విశ్వాసముండాలి. దేవుని మాటలు ఆయన వాగ్దానాలమీద నమ్మికయుంచి కార్యం జరిగించాలని దేవుడు మననుండి ఎదురు చూస్తాడు, కాని మన చురుకైన విశ్వాసం ఏ విధంగాను మన రక్షణను సంపాదించేదిగా చూడబడనే కూడదు.

కాలేజీలో నేను చదివిన అనేక కోర్సుల్లో, ప్రొఫెసరుతో నేను కాంట్రాక్టు చేసుకున్నాను. సెకెండ్ క్లాస్ (B గ్రేడ్) పొందడానికి ఇది, యిది, యిది నేను చేయవలసి ఉంది. ఫస్ట్ క్లాస్ (A గ్రేడ్) పొందగోరితే, నేను ఇది, యిది, యిది, యింకా యిది చేయవలసి ఉంటుంది. సంవత్సరాంతంలో నేను ఫస్ట్ క్లాస్ (A గ్రేడ్)కు ఒడంబడిక చేసికొంటే, ఫస్ట్ క్లాస్ (A గ్రేడ్) సంపాదించుకొనడానికి కావలసినవాటినన్నిటిని నేను పూర్తి చేసినట్టయితే, ఫస్ట్ క్లాస్ (A గ్రేడ్)కు నేను పాత్రుడను. పస్ట్ క్లాస్ (A గ్రేడ్) యివ్వడంలో ప్రొఫెసర్ నాకు ఏలాటి ఉపకారము చేయలేదు. నేను ఆ పనియంతటిని చేసినట్టయితే, అతడు నాకు దానిని యివ్వ బాధ్యుడై ఉంటాడు. అది కాంట్రాక్ట్.

రక్షణ అనేదానికి వచ్చేసరికి, పరిస్థితి వేరుగా ఉంటుంది. "రక్షణకు మెట్లు" అని కొన్నిసార్లు మనం పిలిచే – వినుట, విశ్వసించుట, మారుమనస్సు పొందుట, ఒప్పుకొనుట, బాప్తిస్మం పొందుట అనేవాటిని దేవునితో పెట్టుకున్న కాంట్రాక్టుగా దయతో ఎవరును అపార్థం చేసికోవద్దు. "నేను పనులు చేసినట్టయితే, రక్షణకు పాత్రుడనైయుంటాను" అని తలంచవద్దు. దేవునినుండి శాశ్వతంగా కొట్టివేయబడడానికే, పాపులంగా మనం పాత్రులమైయున్నాం. కృపచేతనే దేవుడు మనకు రక్షణ అనుగ్రహింపకోరాడు.

ఆయన వాక్యాన్ని వెదకి, దానికి మనలను మనం అప్పగించుకొని, దేవుడు దేనికొరకు నిలిచియున్నాడో దానికి వ్యతిరేకంగా వెళ్లే మన కార్యములనుండి మరలినవారమై – మారుమనస్సు పొందినప్పుడు దేవునియందు మన నమ్మికను కనుపరచుతాం. యేసు ప్రభువని మన నోటితో ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మం పొందినప్పుడు, దేవునియందు మన విశ్వాసాన్ని కనుపరచుతాం. నీకో, నాకో, యింకా ఎవరికో – ఈ పనులలో ఏవియు రక్షణను సంపాదించలేవు. పాపులు రక్షణను సంపాదించుకోలేరు. అది కేవలం దేవుని కృపవలన మాత్రమే కలుగుతుంది. మన రక్షణ దేవుని కృపకు కీర్తి కలిగిస్తుంది.

## మన రక్షణ దేవుని కృపావరమును బయలుపరచుతుంది

2:8, 9 వచనాలను మరోసారి చదువు. "మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు; ఇది మీవలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియలవలన కలిగినదికాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు." విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షణ అని స్థాపించడానికి పౌలు రెండు కట్టుదిట్టమైన ప్రతిపాదనలను చేశాడు. కృప "వరము" అనే విషయాన్ని ఆ రెండును నొక్కి చెప్పుతాయి. ఇందులో ప్రాముఖ్యంగా అతడు చెప్పినదేమంటే: "రక్షణ మనంతట మనమే సాధించుకోలేదు, దేవుడు దానిని మనకు దయచేశాడు. రక్షణ మన పక్షంగా బాగుగా చేసిన పని కాదు. అది సంపూర్తిగా దేవుని వరమైయుంది."

మన రక్షణ క్రియల మీద అధారపడలేదని పౌలు మరోసారి నొక్కి చెప్పాడు. అది మనపట్ల చెప్పుకోదగినంత సాధనకు మనం పొందే బహుమానం కాదు. దేవుని

అంగీకారాన్ని పొందడానికి రూపింపబడిన పనులచే ఎవడును ఎన్నడును రక్షింపబడనేరడు. "సొంతగా సంపాదించుకొన్న రక్షణ అనే ప్రతి అవకాశాన్ని పౌలు రద్దు చేశాడు" (మూసివేశాడు).[2]

క్రియలవలన రక్షణ కలుగుతుందనే ఆలోచన వ్యర్థమయ్యిందని చూపడానికి కెంట్ హూ ఒక పాత కాలపు కథను చెప్పాడు.

> ఒక మనిషి తన గాడిద మీద ప్రయాణం చేస్తూ మార్గంలో ఒక వింతైన వస్తువు పడియుండడం చూచాడు. అతడు తన గాడిదను దిగి దగ్గరగా వచ్చి చూచి, ఒక పిచ్చుక తన శక్తిహీనమైన కాళ్లను ఆకాశం తట్టు ఎత్తి తన వీపుపై పండుకొని యుండడం అతడు కనుగొన్నాడు. మొదటిగా ఆ పక్షి చనిపోయిందని అతడు తలంచాడు, కాని జాగ్రత్తగా పరిశీలించిన మీదట అది సజీవంగానే ఉన్నట్టు అతడు రుజువు చేసుకున్నాడు. "పిచ్చుకా నీవు బాగున్నావా?" అని అతడు అడిగాడు. "బాగానే ఉన్నాను" అని ఆ పిచ్చుక బదులిచ్చిందట. "నీ వీపుమీద పరుండి నీ కాళ్లు ఆకాశం వైపు ఎత్తి నీవు ఏమి చేస్తున్నావు?" అని ఆ మనిషి అడిగాడు. "ఆకాశం పడిపోతుందనే వదంతి విన్నాను. దానికి సపోర్టుగా నా కాళ్లు ఎత్తి పట్టానని" ఆ పిచ్చుక బదులిచ్చిందట. "నీ అల్పమైన కాళ్లతో నీవు దాన్ని ఎత్తి పట్టుకోగలవని నీవు నిజంగా అనుకోవు, కదూ?" అని ఆ మనిషి అన్నాడట. బహు పవిత్రమైన చూపుతో, "ఒకరు తాను చేయగల అతి శ్రేష్ఠమైన దాన్ని చేస్తారు" అని చమత్కారంగా ప్రత్యుత్తరమిచ్చిందట. ఆ చిన్న పక్షి యొక్క పనికిమాలిన పనులు, స్వయం వంచన విదితమై ఉన్నాయి.
>
> గాలిలో తేలాడిన ఆ పక్షి యొక్క కాళ్లు లేదా శవానికి మేకప్ వేయడం ఎంతటి నిరాశా జనకములు లేక హాస్యాస్పదములో అదేవిధంగా మానవ పరిస్థితి ఉంటుంది. ఎవడును క్రియలవలన ఎన్నడు రక్షింపబడడు.[3]

స్నేహితుడా, రక్షింపబడిన వ్యక్తి గర్వంతో అదిరిపడడం ఎందుకు హాస్యాస్పదమై ఉంటుందో యిది వివరిస్తుంది. ఒక మనుష్యుడు మరియొకని వైపు చూచి "అతని కంటే నేను ఎక్కువ నీతిమంతుడను, ఆమెకంటే నేను శ్రేష్ఠమైనదానను. నాకు శ్రేష్ఠమైన సన్మార్గముంది, క్రీస్తును వెంబడించడంలో నేను ఎక్కువ నిలకడగా ఉన్నాను. నేను శ్రేష్ఠమైన క్రైస్తవుడను" అనుకొనడం బహు తప్పయి ఉంటుంది.

ఆత్మ సంబంధమైన ఈలాటి ఆతిశయం మన హృదయాలలోనికి, మనస్సుల్లోనికి తన మార్గాన్ని చొచ్చుకొని రావచ్చు, కాని దేవుని కృపను అది బొత్తిగా అపార్థం చేసుకున్నట్టౌతుంది. క్రీస్తు సిలువ యెదుట మనమందరం సమతలమందు నిలిచి యుంటాం. మన నిరీక్షణ మన నీతి కాదు. మనం ఎంత మంచివారమో అనేది కాదు, తల్లిదండ్రులుగా గాని, పిల్లలుగా గాని మనం ఎంత అద్భుతమైనవారమో అనేది కాదు, మన సన్మార్గం కాదు. మన ఏకైక నిరీక్షణ – దేవుని యొక్క కృపాదానము – యేసు క్రీస్తే. తత్ ఫలితంగా, మనం అతిశయించడానికో లేక యితరులకంటె మనం ఎక్కువ నీతిమంతులం లేక ఆత్మ సంబంధులం అని చెప్పడానికి ఏ హేతువూ లేదు. బలహీనులుగా కన్పించేవారి వద్దనుండి తొలగిపోడానికి మనలో ఎవరికిని హక్కులేదు. ఇతరుల బలహీనతలలో మనం వారికి సహాయం చేయాలి, మన సొంత బలహీనతలకు మనం సహాయం వెదకాలి.

దేవుని కృపయందు ఆనందించడానికిని, ఆయన కృపను గూర్చి యితరులు

ఎరుగునట్లు వారిని ప్రేమించడానికిని, సాటి క్రైస్తవులను ప్రేమించడానికిని మనం పిలువబడ్డాం. ఎంతటి పరిపూర్ణత లేనివారుగా ఉన్నా, మనం సహోదరులను ప్రేమింపక తప్పదు, ఎందుకంటే మనమందరం అదే దేవుని కృపావరమును పంచుకొంటాం. (లేక దేవుని కృపావరములో పాలుపొందుతాం).

## మన రక్షణ దేవుని కృప యొక్క సృష్టిని గొప్ప చేస్తుంది

పౌలు యిలా కొనసాగించాడు: "మరియు వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్ క్రియలు చేయుటకై, మనము క్రీస్తు యేసునందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియైయున్నాము" (2:10). మనమేమైయున్నామో గమనించు: "దేవుడు చేసిన పనియై ఉన్నాం." "చేసిన పని" అనేదానికి గ్రీకు పదం *"poiema"* యిందులోనుండి "poem" (పద్యం) అనే పదం వచ్చింది. అంటే, అది "కళ యొక్క పని, ఒకని సామర్థ్యము తెలిపెడి చిత్తరువు." ఆయన కళ యొక్క పనిని బట్టి, క్రీస్తునందు నీవు దేవుని కృపను పొందుతావు.

మైకిలేంజిలో యొక్క చిత్ర కళ, చెక్కుడు పని అతని ఊహా గానపు మేథస్సును చాటుతుంది. షేక్స్పియర్ నాటకాలు అతని గొప్పతనాన్ని గుర్తించేలా చేస్తాయి. మొజారట్స్ సంగీతం బహు నైపుణ్యంగల తలాంతును ప్రకటిస్తుంది.

పౌలు చెప్పేదేమంటే, "సహోదరులారా, మీ చుట్టూ చూడండి, స్థానిక సంఘంలోని ప్రజలను చూడండి. దేవుడు వారి జీవితాల్లో తెచ్చిన మార్పును చూడండి. ప్రతి జీవితం దేవుని సృజనాత్మక మేథావితకు సాక్ష్యం పలుకుతుంది."

మనము దేవుడు చేసిన పనియై ఉన్నాం. క్రైస్తవ యువకులు దేవుని పద్యములై ఉన్నారు, ఆయన కృపను, కనికరమును, ప్రేమను తెలియజేయు లేక అందజేయువారై యున్నారు. సంఘములోని స్త్రీలు దేవుని చిత్ర లేఖనములై, దైనిక జీవితం అనే తెరమీద జీవిత సారమైయున్నట్టు ఆకర్షింప ఉద్దేశింపబడినవారై ఉన్నారు. క్రీస్తును వెంటాడే పురుషులు ప్రభువైన యేసు యొక్క స్వరూపాన్ని ప్రతిఫలింపజేసేలా దేవునిచే చెక్కబడిన బొమ్మలైయున్నారు. క్రైస్తవులు ఏకంగా ఆరాధనలో పాల్గొనేటప్పుడు, మనలను రక్షించిన దేవుని మహత్తరమైన ఆవరణమును ఎరుక చేయువారమై ఉంటాం.

మనము దేవుడు చేసిన పనియై ఉన్నాం. ఎందుకు? ఆ వచనంలో తరువాత భాగాన్ని గమనించు: "సత్క్రియలు చేయుటకై మనము క్రీస్తుయేసునందు సృజింపబడిన వారమై ..." మనలో ప్రతి ఒక్కరు – సేవ చేయుటకై సృజింపబడినవారమై ఉన్నాం. నీవు సత్క్రియలు చేయలేనంత పసివాడవు కావు, సత్క్రియలు చేయకుండ పని విరమణ చేసే వయస్సుకును నీవు ఎన్నడూ వచ్చి చేరుకోనూ లేవు. "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారియెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" అని ప్రభువైన యేసు అన్నాడు (మత్తయి 5:16).

సత్క్రియలు సంఘపు ఆస్తిగా ఉండునట్లు పరిమితి చేయబడలేదు. సత్క్రియలు

అనుదిన జీవితానికి సంబంధించినవై ఉన్నాయి – యింటి వద్ద సహోదరునితో సహోదరితో ఉపయోగించే మాటలలో, నీ యజమానికి నీవు చేసే పనిలోను, సామానులు కొనేదగ్గర బిల్లువేసే పనివాడి వద్దను, తన బాధలను నీతో చెప్పుకునే వ్యక్తికి నీవు యిచ్చే ప్రోత్సాహంలోను అవి కన్పిస్తాయి.

మన జీవితంతోను, దాన్ని ఎలా జీవిస్తాం అనేదానితోను సత్క్రియలు సంబంధం కలిగియున్నాయి.

## ముగింపు

*The Ragamuffin Gospel* అనే తన రచనలో, బ్రెన్నన్ మానింగ్ ఒక వైద్యుడు తనతో చెప్పిన కథను పంచుకున్నాడు:

> తన ముఖానికి ఆపరేషన్ జరిగిన తరువాత, ఆమె నోరు పక్షవాతంచే వంకర తిరిగి హాస్యగాడిలా ఉన్న ఒక యువతి బెడ్ వద్ద నేను నిలుచున్నాను. ఆమె ముఖ నరములలోని తుంపు, ఆమె నోటి కండరాల్లోనుండి కత్తిరించబడింది. ఇకమీదటనుండి ఆమె అలాగే ఉండబోతుంది. ... ఎలాగైనా, తన బుగ్గ మీదనున్న గడ్డను తొలిగించడానికి, ఆ చిన్న నరాన్ని నేను కత్తిరించాలి.
>
> యువకుడైన ఆమె భర్త ఆ గదిలో ఉన్నాడు. ఆమె బెడ్డుకు ఎదురుగా అతడు నిలిచి యున్నాడు. నన్ను లేకుండ చూచి ఆ సాయంకాలము వారిద్దరు దీప కాంతిలో గడపబోతున్నారు. వారిద్దరు ఎవరు అని నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. అతడును నేను చేసిన ఆ వంకర మూతి చూచుకొని ఒకరినొకరు ఔదార్యంగాను, ఆశగాను ముట్టుకున్నారు. ఆ యువతి మాట్లాడింది.
>
> "నా నోరు ఎల్లప్పుడు యిలాగే ఉంటుందా" అని ఆమె అడిగింది.
>
> "అవును" అలాగే ఉంటుంది, ఎందుకంటే "నరము కత్తిరించాను" అని నేను అన్నాను.
>
> ఆమె తల ఆడించి మౌనియై ఉంది. కాని ఆ యౌవనుడు నవ్వాడు.
>
> "అది నాకు యిష్టం, అది ఒక రకమైన నేర్పుగా ఉంది" అని అతడన్నాడు.
>
> వెంటనే అతడెవరో నేను ఎరిగాను. నేను గ్రహించి నా దృష్టిని క్రిందికి దించుకున్నాను. దేవతను ఎదుర్కొనేటప్పుడు ఒకడు ధైర్యంగా ఉండడు. ఏమీ పట్టించుకోకుండగనే, ఆ చొట్ట గిల్లిన ముఖాన్ని ముద్దు పెట్టుకొనడానికి అతడు వంగాడు. నేను దగ్గరే ఉన్నాను, ఆ వంకర మూతికి అనుకూలంగా త్రిప్పి, వారి ముద్దు యింకా పని చేస్తుందని ప్రదర్శించడానికి అతడు తన పెదవులను ఎలాగు మళ్లించాడో నేను చూచాను.[4]

సిలువను గుర్తు చేసికో. గొల్గొతాను జ్ఞాపకం ఉంచుకో. అక్కడ దేవుడున్నాడని జ్ఞాపకం చేసికో – అక్కడ దేవుడు మనిషిలా ఉన్నాడు. దేవుడు వంచబడ్డాడు, వంకరగా త్రిప్పబడ్డాడు, కొట్టబడి, రక్తం కార్చుతున్న దేవుడైయున్నాడు. యేసునందు దేవుడు, మనతో సర్దుబాటుకు తన పెదవులను త్రిప్పాడు, మురికి గుడ్డలవంటి మన మంచి పనుల కంటె, తన కృపను ఆధారంగా చేసికొని మన యెడల తన వైఖరిని మల్చాడు.

దేవుని కృప యొక్క సత్యానికి ఒక క్షణంపాటు నీ హృదయాన్ని తెరచి ఉంచు. తన కృప నీ జీవితంలోనికి ప్రవహించునట్లు నీ విశ్వాసపు కాలువ సరిచేయబడిందా? నీవు

బాప్తిస్మం పొందావా? రక్షణను సంపాదించుకొనడానికి కాదు సుమీ, అయితే యేసు నీకే ఏకైక నిరీక్షణయై ఉన్నట్టు నీ బలీయమైన విశ్వాసాన్ని వ్యక్తపరచుకొనడానికే!

దేవుని కృపను గూర్చిన ఆలోచన నీ గర్వాన్ని తగ్గిస్తుందా? ఒకవేళ నిన్ను నీవు ఏదో ఒక అంతస్థులో పెట్టుకొనియుండవచ్చు. మంచితనంలోను, నీతిలోను యితరులకంటె ఎక్కువగా నిన్ను నీవు ఎంచుకొనుచుండవచ్చు. బహు దైన్యమైన స్థితిలో మనమందరం దేవుని యొక్క అవసరతలో ఉన్న ప్రజలమని మరలా చూచుకొనేలా దేవుని కృపను గూర్చిన జ్ఞాపకం నిన్ను చేసిందా? దేవుని కృపను గూర్చి మనం ఆలోచిస్తుండగా, అంత గర్వంగా అంత విమర్శనాత్మకంగా ఉండకుండేలా సహాయం చేయుమని నీవు ఆయనను అడుగుతావా?

సత్కార్యముల యొక్క ఉద్దేశము వాటి విలువను నీవు మరలా చూచునట్లు దేవుని కృప నిన్ను ప్రోత్సహించుతుందా? సత్క్రియలు మనకు ఏమీ సంపాదించి పెట్టలేవు. "దేవా, నీకు స్తోత్రము" అని తన కృప అంతటికి కృతజ్ఞత తెలియజేయడానికి మాత్రమే అవి మార్గాన్ని రమ్యంగా తీర్చిదిద్దుతాయి.

---

సూచనలు

[1]Max Lucado, *He Still Moves Stones* (Dallas: Word Publishing, 1993), 196. [2]A. Skevington Wood, *Ephesians*, The Expositor's Bible Commentary with The New International Version of the Holy Bible, gen. ed. Frank E. Gaebelein (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1978), 36. [3]Kent Hughes, *Ephesians: The Mystery of the Body of Christ* (Wheaton, Ill.: Crossway Books, 1990), 84. [4]Brennan Manning, *The Ragamuffin Gospel: Embracing the Unconditional Love of God* (Sisters, Oreg.: Multnomah Books, 1990), 105-6.